

# మీ రహస్యం నాకు చెప్పరూ

**తురగా జానకీరాణి**

పంపు దగ్గర నీళ్ళు పట్టుకుని, బుజాన బిందె ఎత్తుకుంటూ ఎదురింటికేసి చూసింది వనజ. తలుపులు వేసేవున్నాయి. కానీ కిటికీ దగ్గర కూర్చుని ఇటే చూస్తున్న రెండు కళ్ళు కనబడ్డాయి. బిందె బరువుకి బుజం కలుక్కుమంటున్నా, అంచేత అట్టేసేపు అటు చూడక, లోపలికి వెళ్ళింది వనజ. మరో బిందె, మరో బక్కెట్టు అల్లా పట్టుకుంటూ మధ్య మధ్యలో కిటికీ వెనుకనున్న మనిషివంక చూడసాగింది.

తెల్లవారకుండా లేచినా ఇప్పటికింకా పనులు కాలేదు. ఇంట్లోవున్న వారు మరో ముగ్గురే అయినా, ముగ్గురూ మగ మహారాజులే. అయినా, ఇద్దరు కొడుకులున్నా. వాళ్ళు లేవడం, పాలు, కాఫీలు సేవించడం, పేచీలు పడడం, జుట్టు పట్టుకోవడం ఇవే ఇంతవరకు సరిపోయాయి. ఆయన గారం లేనో ఒకనాడు పరిపాదకాగ్రేసరుల్లా పడుకుంటే పడుకోవడమే, కూర్చుంటే కూర్చోవడమే. పేపరు చదివితే చదవడమే. ఇంక మరోనాడు చిచ్చుబుడ్డిలాగ హడావిడి చేస్తారు. వీటితోటే టైము గడుస్తుంది. డబాటుగా కూర్చుని వీధిలోకి చూడ్డాని నాకు అసలు ఎన్నడైనా కుదురుతుందా?

"ఎదురింటి అమ్మాయికేం, డాం వంటరిదికాదు. ఆమె, భర్త; ఒక కొడుకు. ఎంతపని లేదనుకున్నా పంపులోంచి నీళ్లు పడుతున్న కాస్సేపైనా ఆ జలపాతం ముందు జపం చేయవద్దా? వాళ్ళింటిలో నీళ్ళు బ్రహ్మాండంగా వస్తాయేమో. పని దాన్ని అడగాలి. ఆయనగారు సూటు, బూటు వేసి షోగ్గానే వుంటాడు. ఐతేనేం ఇంటిలో పనులన్నీ చేస్తాడు కాబోలు. లేకపోతే ఇంతతడబాటు ఎల్లావుంటుంది?

ఇన్ని విధాల వనజ అనుకుంటూ బిందెలు. బక్కెట్లు నింపుతూ నిర్మోహమాటంగా కిటికీవేపే చూస్తోంది. అంత సేపూ కిటికీలోని ఆ వనిత అల్లా కూర్చునే వుంది. ఇది ప్రొద్దుటి ఘట్టం.

ఆడవాళ్ళు-అందునా భర్త, పిల్లలుగల యిల్లాలు మంచి పని టైములో కిటికీదగ్గర కూర్చుని వీధుల్లో వచ్చిపోయే చోద్యాలు చూడ్డం అనేది చాలా గొప్ప చోద్యం.

మధ్యాహ్నం పూలవాడి కేక వినబడింది. వనజ నిద్రపోతున్నది కాస్తా, వాడు పోతాడేమోనని గబగబ తలుపు తీసుకుని గేటుదగ్గరకు వచ్చింది. ఎదురింటిదగ్గిర వున్నాడు. ఆమె పూలు కొంటోంది-తెల్లని చీరె, తెల్ల జాకెట్టు. పైకి అందంగా చుట్టిన ముడి. ఎండలోని వేడినంతా చల్లగా మారుస్తున్నట్లుంది ఆమె రూపం చూస్తోంటే. బూజుబారిన తన చీర, మెడపైన, ముఖంపైనజిడ్డుగా అతుక్కున్న తనజుట్టు, తన ఆకారం చూసుకుంది వనజ. ఎదురుగా నిలబడ్డానికే సిగ్గేసి లోపలికి వెళ్ళింది. ఎదురింటామె ఇంటిలోకి వెళ్ళిందని చూశాక, తను బైటికి వచ్చి పూలుకొన్నది. ఇది మధ్యాహ్నం ఘట్టం.

వేసవికాలం మధ్యాహ్నంపూట ఎంత అందమైన వాళ్ళయినా, జిడ్డు ముఖాలుగా తయారుకాక మానరు. కానీ ఆమె కడిగిన ముత్యంలా వున్నది. ఎవరైనా యింటికి వస్తారని సింగారించుకుని కూర్చున్నదేమో యీవేళ అనుకుంది వనజ.

వనజ సాయంత్రం మళ్ళీ నీళ్ళు పట్టుకుంటూంటే ఆమె తలుపు తెరచుకుని బయటికి వచ్చింది. ఆమెది అందమైన ఆకారం. లేత పసుపురంగు వాయిలు పెద్దపెద్ద పూలు అద్దినది కట్టుకుంది. ఆ చీరె మెత్తగా ఆమె వంటిన అదుముతున్నట్లుంది. ఆ లేతరంగు మెడమీద కాంతిని పరుస్తోంది. చేతులు పైకెత్తి గుమ్మాన్ని పట్టుకుని ఆమె నిలబడితే, పూచిన తంగేడులా వుంది. కాస్సేపటికి ఆమె యింటికి తాళం వేసుకుని పిల్లవాడి చేయిపట్టుకుని మెల్లిగా రోడ్డుమీద నడుస్తూ బయలుదేరింది. రంగుబొమ్మల అడ్వర్టయిజుమెంటు పత్రికలోంచి దిగి వచ్చి నడుస్తున్నట్లుంది. ఆమె పెద్దగా సింగారించుకోలేదు. గొప్ప అందగత్తె కాదు. కానీ ఆ హొయలు, పరిశుభ్రత, చీరె కదలికలో వెలువడుతున్నట్లున్న సుగంధ పవనాలు-వనజ కన్నార్పకుండా చూసింది.

ఆ బిందె లోపల పెట్టాక గబగబ స్నానం చేసింది వనజ. తెల్లని-చీరె, సన్న ఎర్రజరీ అంచుది కట్టుకుని, కాటుక దిద్దుకుని, ఎర్రని కుంకుమ పెట్టుకుని, ఇన్ని పూలు తురుముకుంది. పిల్లలువచ్చిచూచి, "అమ్మా-ఆచ్చిపోదామా?" అని అడిగారు, "లేదునాన్నా!" అంటే-"మరి చీరె ఎందుకు కట్టుకున్నావు?" అన్నారు.

"ఊరికేనే" అన్నది వనజ.

కొంచెం ప్రొద్దుపోయాక యింటికి వచ్చిన వనజ వాళ్ళ ఆయనకూడా, "ఎక్కడికేమిటి పేత్తనాలు వెళ్ళి వచ్చావు?" అన్నాడు. ఆమె ముఖం ముడుచుకుని, "ఎక్కడికీ లేదు. సాయంత్రం శుభ్రంగా బట్ట కట్టుకోకూడదా?" అన్నది.

"కాదులే. ప్రత్యేకం సింగారించు

కుంటేను...” అని అతను అటొంటే “నా సంతోషం కోసం నేనే చేసు కున్నాను” అన్నది.

ఎదురింటి వనిత రోజూ హృదయం పూట-ఖాళీగానే కూర్చుంటుంది కిటికీలో. మధ్యాహ్నమప్పుడు పోస్టు అందుకోవడానికి వచ్చినప్పుడైనాసరే మాయని చీర, చెరగని తలతో కనబడుతుంది. ఇంక సాయంత్రాలైతే చెప్పక్కర్లేదు. రోజూకు బట్టలమిల్లువాళ్లు అందంగా షోకేసులలో బొమ్మలకి చీరకట్టి వదిలినట్లు, కొడుకు, తను నడిచిపోతుంటారు. వనజకికూడా ఆమెనుచూసి చూసి తన అలంకరణమీద శ్రద్ధ ఎక్కువైంది. పిల్లల్ని ఎదురింటి పిల్లవాడిని పిల్చుకు రమ్మని పంపి అతనికీ, వీళ్ళకీ ఆటల్లో స్నేహం కల్పించింది. ఆ పిల్లవాడిని అన్నీ అడగాలని.

ఆమె-ఎదురింటి ఆమెది ఒకరికోసం చేసుకునే అలంకరణకాదు అని తేలిపోయింది. అది ఒకనాటి ప్రత్యేక యత్నమూ కాదు. సహజంగానే అలా అందంగా పూలతీగలా పుట్టినట్లుందామె. మెల్లిగా స్నేహం కలుపుకుని-‘ప్రొద్దున్న పని పాటలు ఎల్లాగవుతాయి? మీ ఇంట్లో నీళ్లు పట్టుకోనక్కర్లేదా? పనులన్నీ మీ ఆయనే చేస్తారా? మధ్యాహ్నం పూట కాస్సేపు నడుం వాల్చరా? సాయంత్రం వంటపని వుండదా? మీ చీరెలు ఎవరు ఎవరు వుతికి యిస్త్రీ చేస్తారు?” లాంటి ప్రశ్నలు రెన్నో వేసి, జవాబులు తెలుసుకోవాలని ఆలోచన చేసింది. ఏమిటో పట్టలేని కుతూహలం, ఆమె జీవితం చూస్తోంటే. విపరీతమైన ఆకర్షణ.

ప్రొద్దున్న బుజాన బిందె ఎత్తుకుంటూ ఎదురింట్లోకి చూసిన వనజకి, బార్లా తెరచిన తలుపులు కనబడ్డాయి. బండిలో సామాను వెళ్ళిపోయింది. రిక్షాలో ఫాను పెట్టుకుని పిల్లవాడు కూర్చున్నాడు. ఆయన యింట్లో యింకేవేవో సర్దుతున్నట్లున్నాడు.

వనజకి అకారణంగా ఒక కంగారు కలిగింది. “బాబూ! ఎక్కడికి వెడుతున్నారు?” అన్నది.

“ఇంకోయింటికి.”

“మీ అమ్మగారు ఏరీ?”

“రాత్రే వెళ్ళిపోయింది. అక్కడే పడుకుంది.”

“అయ్యో! ‘మాయని చెరగు, చెరగని సింగారం మీవి. వాటి రహస్యం ఏమిటో నాకు చెప్పండి-’ అని అడగకుండానే వెళ్ళిపోయిందామె, అయ్యో!

ఆ సాయంత్రం ఆరున్నరకి వనజవాళ్ళ ఆయన యింటికి వచ్చేటప్పటికి వనజగానీ పిల్లలుగానీ రోజూ మల్లే టిప్‌టాప్‌గా తయారైలేరు.

“ఇదేమిటి? ఇల్లాగే వున్నారేం యింకా?” అన్నాడాయన.

వనజ విసుగ్గా, “ఏదో లెద్దురూ! ఇంట్లో వుండేవాళ్ళం ఎల్లా వుంటే నేం?” అన్నది. ★


# దీపావళి

దేదీప్యమానమైన కాంతి చిహ్నం దీపావళి. లక్షలాది దీపాల కాంతి నూతన సంవత్సరారంభ సూచనగా రేపటి దారికి వెలుగులు వెదజల్లుతుంది. మీ ముందు చూపు ఎల్లప్పుడూ కాంతివైపుండేలా, తమకు అందే యీ సందేశం నీడల జాడలను మీ వెనుకబడేలా చేస్తుంది.

దీపావళి సందేశమే సిండికేట్ బ్యాంకు అందించు సందేశం. ఈనాడు మిమ్మల్నిగూర్చి ఆలోచిస్తూ, రేపటి మీ సంక్షేమానికి కావలసిన జాగ్రత్తలు తీసుకొంటుంది. దీపావళి దీపకళిక వలెనే, సిండికేట్ బ్యాంకు మీ దారిలో కాంతిని వెదజల్లి మీ సుఖసౌఖ్యాలను గుర్తించేలా చేస్తుంది.

సేవే జీవితాదర్శంగా భావించే బ్యాంకు—సిండికేట్ బ్యాంకు

హెడ్ ఆఫీస్:
మణిపాల్ (కర్ణాటక రాష్ట్రము)

కె. కె. పాయ్
మేనేజింగ్ డైరక్టర్.